క్లుప్తంగా

ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలన్నదే లక్ష్యం



తాగునీటి ట్యాంకు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

సఖినేటిపల్లి: నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. సోమవారం గొందిలో జల్ జీవన్ మిషన్‌లో రూ.31.70 లక్షలతో నిర్మించిన నూతన తాగునీటి ట్యాంకును ఆయన ప్రారంభించి, సదరు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, రాజోలు ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ దొండపాటి రవికుమార్, ఎంపీటీసీ కొల్లాబత్తుల శుభాకర్, పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, నాయకుడు గెడ్డం అమ్ములు, స్థానికులు పాల్గొన్నారు.

నేడు విశ్వేశ్వరస్వామి కల్యాణం

అంబాజీపేట: మాచవరం శివారు కోటివారి అగ్రహారంలో కొలువుదీరిన భువనేశ్వరీ సమేత విశ్వేశ్వరస్వామి కల్యాణ వేడుకలను మంగళవారం రాత్రి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం అంకురారోహణ, ధ్వజారోహణ, స్వామివారి కల్యాణాన్ని నిర్వహించనున్నామన్నారు. ఈనెల 21 మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించనున్నామన్నారు. 24న త్రిశూల స్నానం, 25న శ్రీ స్వామివారి పుష్ప ఉత్సవ వేడుకలను జరపనున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఘనంగా వేంకటేశ్వరుని కల్యాణం

అంబాజీపేట: పుల్లేటికుర్రులో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త బచ్చు సుబ్రమణ్య గుప్తా పర్యవేక్షణలో ఆలయ అర్చకులు పాణింగపల్లి వెంకటాచార్యుల ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం కనులపండువగా నిర్వహించారు. మంగళవారం స్వామివారి ఉయ్యాల సేవను ఈ నెల 24న గరుడోత్సవం, 25న పుష్పోత్సవం నిర్వహించనున్నమన్నారు. వేంకటేశ్వరుని కల్యాణానికి గ్రామంలోని మహిళలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వీక్షించే తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేటి నుంచి వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు

కొత్తపేట: మండలంలోని ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామివారి దేవస్థానం క్షేత్ర పాలకుడు వేణుగోపాలస్వామి వారి కళ్యాణోత్సవాలు ఈ నెల 20 నుంచి 25 వరకూ ఘనంగా నిర్వహించనున్నట్టు దేవస్థానం ఈఓ, ఏసీ కె.విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం రాత్రి గ్రామోత్సవం అనంతరం కల్యాణం, 21, 22, 23 తేదీల్లో వివిధ పూజా, వివిధ వాహనాలపై స్వామివారి ఊరేగింపు కార్యక్రమాలు, 24న చక్రస్నానం, 25న పుష్పోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తులు అందరూ ఈ కల్యాణోత్సవాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

నేడు లక్ష్మీనృసింహస్వామి, వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెంలో కొలువైన లక్ష్మీనృసింహస్వామికి చింతనలంకలో కొలువైన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామికి మంగళవారం కల్యాణమహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. చింతనలంకలో భారీ ఎత్తున తీర్థ మహోత్సవాలు నిర్వహిస్తారు. అలాగే రెండు గ్రామాల్లో స్వామివార్ల ప్రత్యేకంగా అలంకరించిన రథంపై గ్రామంలో ఊరేగిస్తారు. సాయంత్రం వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివార్లకు కల్యాణం జరుపుతారన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు హాజరవుతారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకం



తాటిపాకలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ స్టాల్

రాజోలు: ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేసి పండించిన ఉత్పత్తులను సోమవారం తాటిపాక పెద్దవంతెన వద్ద అమ్మకాల స్టాల్‌ను సర్పంచ్ కోటిపల్లి రత్నమాల ప్రారంభించారు. ప్రకృతి సిద్ధంగా పండించిన కూరగాయలు, ఆకుకూరలు, మిల్లెట్స్, బెల్లం, చింతపండు, పప్పు ధాన్యాలను విక్రయించారు. ఏఓ శ్రీనివాస్, మార్కెటింగ్ ఎస్‌ఎఫ్‌ఏ అనంత కుమార్, ఎంటీ జోసెఫ్ మల్లిక, వీఏఏలు సాయి, రామసీత తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

పి.గన్నవరం: స్థానిక ఏజీ రోడ్డులో వేంచేసిన లక్ష్మీ కనకదుర్గమ్మ వారి ఆలయ 29వ వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 108 కలశలతో పవిత్ర వైనతేయ నదీ జలాలతో అమ్మవారికి మహిళలు అభిషేకాలు, సామూహిక కుంకుమార్చనలు చేశారు. రాత్రి పినిశెట్టి బాబ్జీ భవానీ ఆధ్వర్యంలో దుర్గా హోమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన నిప్పుల గుండంలో భవానీలు, భక్తులు నడచి వెళ్లారు.

మహిళా సాధికారతతోనే ఆర్థిక ప్రగతి

- ఎమ్మెల్యే జగ్గిరెడ్డి
- రూ.60.08 కోట్ల ఆసరా చెక్కుల పంపిణీ



జొన్నాడలో డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: మహిళ సాధికారతతోనే దేశ ఆర్థిక ప్రగతి సాధించవచ్చనే దృఢ సంకల్పంతో సీఎం జగన్ గతంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో వైఎస్సార్ ఆసరా వంటి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి మహిళలను అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దుతున్నారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి కొనియాడారు. మండలంలోని జొన్నాడ సోమాలమ్మ అమ్మవారి ఆలయం సమీపాన మైదానంలో సోమవారం వైఎస్సార్ ఆసరా తుది విడత మంజూరు పత్రాల పంపిణీ జరిగింది. పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, సర్పంచ్ కట్టా శ్రీనివాసు తదితరుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పాల్గొని ప్రసంగించారు. నియోజకవర్గంలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. మహిళల ఆర్థిక స్వావలంబన సాధించేందుకు విశేషంగా తోడ్పాటును అందించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మహిళందరూ అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి సంక్షేమ ప్రధాత సీఎం జగన్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందని మహిళలకు వివరించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన మహిళలతో సభా ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. రాష్ట్రాభివృద్ధి కోసం గత ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన కృషిని ప్రసార మాధ్యమాల ద్వారా వివరించిన తీరు సభికులను విశేషంగా ఆకట్టుకుంది. నియోజకవర్గ ప్రజలకు ఆపత్కాల సమయంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి స్పందిస్తున్న తీరును పలువురు నేతలు ప్రశంసించారు.

వైఎస్సార్ ఆసరా పంపిణీ ఇలా

నియోజకవర్గంలో 6297 డ్వాక్రా సంఘాలకు నాలుగు విడతలుగా రూ.219.60 కోట్లు పంపిణీ చేయగా ఆలమూరు మండలంలో నున్న 1652 డ్వాక్రా సంఘాలకు ఇప్పటి వరకూ రూ.60.08 కోట్ల పంపిణీ జరిగింది. ఎంపీడీఓ ఎ.మేరీ రోజ్, ఏపీఎం ఎం.ధనరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పార్టీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవాని, ఏజీపీ నామాల శ్రీనివాసు, రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి దియ్యన పెదకాపు, పీఏసీఎస్ అధ్యక్షుడు తాడి మెహెర్ ఆదిత్యరెడ్డి, మోటుపల్లి వెంకన్న, నల్లి రాజు, చామకూరి శ్రీనివాసు, ఆనె వెంకన్న తదితరులు పాల్గొన్నారు. అలాగే వైఎస్సార్ ఆసరాకు హాజరైన వేలాది మంది మహిళలకు ఆయన లక్కీ డీప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి కుటుంబ సభ్యుల చేతుల మీదుగా విజేతలైన 100 మందికి రూ.1.5 లక్షల విలువైన కుక్కర్లను అందజేశారు. సభకు హాజరైన మహిళలకు ఎమ్మెల్యే తన సొంత ఖర్చులతో ఆత్మీయ విందును ఏర్పాటు చేసి కుటుంబసభ్యులతో స్వయంగా వడ్డించారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం

జెడ్పీ విప్పర్తి, ఎమ్మెల్యే చిట్టిబాబు



మామిడికుదురులో వలంటీర్లకు అవార్డులు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి, ఎమ్మెల్యే కొండేటి

మామిడికుదురు: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వలంటీర్లు వారధిగా పని చేస్తూ ఉత్తమ సేవలందిస్తున్నారని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమం మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం జరిగింది. మండలంలోని 11 గ్రామాలకు చెందిన వలంటీర్లలో ఒకరికి సేవా వజ్ర, ముగ్గురికి సేవా రత్న, 255 మందికి సేవా మిత్ర అవార్డులను అందించారు. వారికి మెడల్స్ అందించి శాలువాలతో సన్మానించారు. వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల సమయంలో వలంటీర్లు అందించిన సేవలు అమూల్యమైనవని పేర్కొన్నారు. వలంటీర్లను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అవార్డులు ఇస్తోందన్నారు. ఒకరు ఎక్కువ కాదు, మరొకరు తక్కువ కాదన్నారు. ప్రభుత్వం దృష్టిలో అందరూ సమానమేనన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుసుమ వనజకుమారి, జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్లు కటకంశెట్టి ఆదిత్య, యూవీవీ సత్యనారాయణ, గెడ్డం కృష్ణమూర్తి, సర్పంచ్ గుబ్బల దుర్గ, ఎంపీటీసీలు జాలెం అనూష, బొంతు నీలిమ, పార్టీ నాయకులు తులా గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలి



నాగుల్లంకలో సచివాలయ భవనం శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు, పార్టీ ఇన్‌చార్జి విప్పర్తి

పి.గన్నవరం: ప్రజా సంక్షేమంతో పాటు, రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్న జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. నాగుల్లంకలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, కె.ముంజవరంలో రూ.23.8 లక్షలతో నిర్మించిన ఆర్‌బీకే, ఆర్.ఏనుగుపల్లిలో రూ.63.94 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, ఆర్‌బీకే భవనాలను సోమవారం వారు ప్రారంభించారు. సమావేశాల్లో వారు మాట్లాడారు. జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాస్, కార్పొరేషన్ డైరెక్టర్ మద్దుల వరలక్ష్మి, సర్పంచ్‌లు దొమ్మేటి పార్వతి, యల్లమెల్లి కృష్ణవేణి, కుంపట్ల నాగలక్ష్మి, ఎంపీటీసీలు కారుపల్లి సునీత, యాండ్ర విజయలక్ష్మి, కుంపట్ల వీవీ నరసాయమ్మ, సొసైటీ చైర్మన్ కుంపట్ల గోపి, రాష్ట్ర నాయకులు దొమ్మేటి వెంకటశివరామన్, పితాని నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: టీడీపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. సోమవారం విశ్వేశ్వరాయపురంలో జరిగిన సమావేశంలో టీడీపీ నాయకులకు ఎమ్మెల్యే రాపాక పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి జనరంజక పాలన సాగిస్తున్నారని, అందుకే వైఎస్సార్ సీపీకి ఆకర్షితులవుతున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్ విజయకేతనం ఎగురవేస్తారన్నారు. జెడ్పీటీసీ బళ్ల ప్రసన్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ



మడికిలో అర్హులైన మహిళలకు పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలను అందించి ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

ఆలమూరు: ప్రతి మహిళకు సొంతిల్లు కల నిజం చేయాలన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయ సాధన మేరకు నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో సుమారు 17,658 మందికి ఇళ్ల పట్టాలను అందజేసి వైఎస్సార్ జగనన్న కాలనీలను గ్రామాల మాదిరిగా నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని మడికిలో సోమవారం ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ పడమట సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సర్పంచ్ యు.లక్ష్మి మౌనిక అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో ఇళ్లు లేని నిరుపేద మహిళందరికి ఆడపడుచు కట్నంగా సీఎం జగన్ రూ.లక్షల విలువైన ఆస్తిని అందిస్తున్నారన్నారు. పసుపు, కుంకుమ, గాజుల, నూతన వస్త్రాలతో ఇళ్ల పట్టాలను ఆయన మహిళలకు అందజేశారు. రాబోయే రోజుల్లో పూర్తి హక్కులు పొందే విధంగా సీఎం జగన్ లబ్ధిదారులందరికీ ప్రభుత్వ ఖర్చుతో ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పేర్కొన్నారు. మడికిలో రూపొందించిన లేఅవుట్‌లో మడికి గ్రామానికి చెందిన 459 మంది, చొప్పెల్లకు చెందిన 09 మంది, జొన్నాడకు చెందిన 27 మంది లబ్ధిదారులు ఉన్నట్లు ఆయన తెలిపారు. సీఎం జగన్‌ను రాబోయే ఎన్నికల్లో మళ్లీ ఆశీర్వదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, చల్లా వెంకట సుబ్రహ్మణ్యం, పడమట రాంబాబు, ఉండ్రాసపు సుందర విజయం తదితరులు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమ సారథి జగన్



ఈతకోటలో గౌడ కల్యాణ మండపం ప్రారంభం అనంతరం గౌడ సోదరులతో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: నియోజకవర్గంలో బీసీలకు అండగా నిలబడి, అన్ని రంగాల్లో సాధికారతను అందించి చూపించిన ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అని బీసీల సంక్షేమ సారథిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఈతకోటలో నూతనంగా నిర్మించిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ కల్యాణ మండపం ప్రారంభోత్సవంలో జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బీసీలకు అండగా నిలబడి అసలైన సాధికారతను అందించిన ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అన్నారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా బీసీ, ఎస్సీ, మైనారిటీ, మహిళలకు పెద్ద పీట వేస్తూ ప్రతి నామినేటెడ్ పోస్టులో 50 శాతం రిజర్వేషన్ కల్పించడంతో పాటు పార్టీ నుంచి మరో 10 శాతం మొత్తం 60 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కుట్రలు, కుతంత్రాలు, మాయలు, గ్రాఫిక్స్ నమ్ముకున్న గుంపు ఒక వైపు, ప్రజలనే నమ్ముకున్న నాయకుడు మరోవైపు ఉండి జరగనున్న ఎన్నికల్లో అందరూ జగన్ వైపే ఉండాలని పిలుపునిచ్చారు.

చర్చికి నిప్పు పెట్టిన దుండగులు

- వద్దిపర్రులో ఘటన
- క్రైస్తవ సంఘాల ఆందోళన



ధ్వంసమైన చర్చి

ఆత్రేయపురం: మండలంలోని వద్దిపర్రులో కాలువ రేవు పక్కన గత 12 ఏళ్లుగా పాస్టర్ రెవరెండ్ దాసరి మోజేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బైబిల్ మిషన్ బెతెస్త స్వస్థత శాలకు గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టడంపై క్రైస్తవ సంఘాలు ఆందోళన చేపట్టారు. సోమవారం తెల్లవారుజామున మందిరంలోకి ప్రవేశించి విలువైన వస్తువులు, సామగ్రిని ధ్వంసం చేసి సుమారు రూ.3.50 లక్షలు విలువైన ఎలక్ట్రానిక్స్ పరికరాలను ధ్వంసం చేసి మందిరం లోపల పాత ఎక్సెల్ బండిని ఉంచి నిప్పంటించారన్నారు. దీంతో మందిరం పూర్తిగా మంటల్లో ధ్వంసమై బూడిద పాలైంది. విషయం తెలుసుకున్న ఆత్రేయపురం మండల పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులందరూ అక్కడకు చేరుకుని ఎవరైతే ఈ ఘాతుకానికి పాల్పడ్డారో వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ దాడిలో నష్టపోయిన పాస్టర్ మోజేష్‌ని అన్ని విధాలా ఆదుకోవాలని నినాదాలు చేస్తూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కొబ్బరి వృక్ష మిత్రలకు శిక్షణ ప్రారంభం



అంబాజీపేటలో చెట్టు ఎక్కే విధానాన్ని శిక్షణదారులకు వివరిస్తున్న అధిపతులు చలపతిరావు, రామానందం

అంబాజీపేట: కొబ్బరి అభివృద్ధి బోర్డు (సీడీబీ) సహకారంతో స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఉద్యాన పరిశోధన కేంద్రంలో సోమవారం కొబ్బరి వృక్ష మిత్రలకు శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. స్థానిక పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు ఈ శిక్షణను ప్రారంభించారు. స్థానిక కేంద్ర అధిపతి చలపతిరావు, కొవ్వూరు ఉద్యాన పరిశోధనా స్థానం డాక్టర్ వైఎస్సార్ హార్టీకల్చర్ యూనివర్శిటీ జోనల్ రీసెర్చ్ హెడ్, కోస్టల్ జోన్–1 డాక్టర్ జి.రామానందంలు మాట్లాడుతూ ఈ శిక్షణ సమయంలో క్లైంబింగ్ పరికరం ఉపయోగించి కొబ్బరిచెట్లు ఎక్కే నైపుణ్యాన్ని పెంపొందించుకొని, ఈ వృత్తి ద్వారా జీవనోపాధి పొందడానికి వీలుంటుందన్నారు. కొబ్బరి రైతులు ఎదుర్కొంటున్న దింపు కార్మికుల సమస్య కూడా తొలగిపోతుందన్నారు. ఉద్యాన శాస్త్రవేత్త ఎ.కిరీటి మాట్లాడుతూ కొబ్బరిలో మేలైన రకాలు, నాణ్యమైన నారు మొక్కల తయారీ, విత్తనకాయల సేకరణకు తల్లి చెట్ల గుణగణాలను వివరించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ ఎ.అనూష, డాక్టర్ వి.గోవర్ధనరావు, బి.నీరజలు మాట్లాడుతూ కొబ్బరిని ఆశించే వివిధ రకాల పురుగులు సమగ్ర సస్యరక్షణ చర్యలను వివరించారు. క్లైంబర్ పరికరం ద్వారా మాస్టర్ ట్రైనర్స్ ఈ వెంకటేశ్వరరావు, పి.సోమశేఖర్‌బాబులు యువకులకు శిక్షణ ఇచ్చారు.

అదనపు కట్నం వేధింపుల కేసులో ఏడాది జైలు

అయినవిల్లి: అదనపు కట్నం వేధింపుల కేసులో భర్తకు ఏడాది జైలు, రూ.5 వేలు జరిమానా విధిస్తూ అమలాపురం పీడీఎం కోర్టు జడ్జి ఉమాగౌరీ శంకర్ తీర్పు వెలువరించారు. దీనికి సంబంధించి ఎస్సై బి.రాజేష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నం యలమించిలి పోతురెడ్డిపాలెంకు చెందిన పెమ్మనబోయిన విష్ణు వీర వెంకట సత్యనారాయణ (సత్తిబాబు)కు నేదునూరుకు చెందిన సత్యనాగవేణికి పెద్దల సమక్షంలో 2011లో వివాహం అయింది. వీరికి ఒక బాబు ఉన్నారు. వివాహ సమయంలో రూ.3 లక్షలు కట్నం, ఎకరం అరవై సెంట్ల భూమి, 10 కాసుల బంగారం, ఒక కేజీ వెండి ముట్టజెప్పారన్నారు. పెండ్లి అయిన ఏడాది తర్వాత రూ.లక్ష అదనంగా కట్నం తెమ్మని శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నట్లు తెలిపారు. దీనిపై అప్పటి ఎస్సై డి.దుర్గాశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ముద్దాయి పెమ్మనబోయిన విష్ణు వీవీ సత్యనారాయణ(సత్తిబాబు)పై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు, రూ.5 వేలు జరిమానా విధిస్తూ అమలాపురం పీడీఎం కోర్టు జడ్జి ఉమా గౌరీశంకర్ తీర్పు వెలువరించినట్టు ఎస్సై తెలిపారు. ఏపీపీ రాజశేఖర్ ఈ కేసును వాదించారు.

భారీ ర్యాలీగా గజమాల యాత్ర



పి.గన్నవరంలో కొపనాతి కృష్ణమ్మ, సుబ్బరాజు విగ్రహాలకు పూలమాలలు వేస్తున్న నాయకులు

మామిడికుదురు: అంతర్వేది లక్ష్మీనర్సింహస్వామి ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ మెడలో ఆవిష్కరించే గజమాల యాత్ర ఊరేగింపు సోమవారం ఘనంగా జరిగింది. అల్లవరం మండలం ఓడలరేవు నుంచి పాశర్లపూడి వైనతేయ వారధి మీదుగా మామిడికుదురు, నగరం గ్రామాల్లోని 216వ నంబర్ జాతీయ రహదారిపై ఈ యాత్ర సాగింది. అమలాపురం తాలూకా అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యాత్రకు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన అగ్నికుల క్షత్రియులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. బాణసంచా కాల్పులు, యువత కేరింతలు, మోటారు సైకిళ్ల ర్యాలీతో ఈ యాత్ర ఆద్యంతం ఘనంగా జరిగింది.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: అంతర్వేది ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ గజమాల యాత్రను నియోజకవర్గ అగ్నికుల క్షత్రియ సేవా సంఘం అధ్యక్షుడు శేరు శ్రీనుబాబు ఆధ్వర్యంలో సోమవారం పి.గన్నవరం అక్విడెక్టు వద్ద ప్రారంభించారు. కొత్త అక్విడెక్ట్ పార్కులో కొపనాతి కృష్ణమ్మ, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సంఘం నాయకుడు దివంగత పెమ్మాడి సుబ్బరాజు విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేశారు. అనంతరం అంతర్వేదికి గజమాల యాత్ర కొనసాగింది. కార్యక్రమాల్లో నియోజకవర్గ సంఘ కార్యదర్శి పెమ్మాడి మారుతీ కృష్ణమోహన్, మండల సంఘ అధ్యక్షుడు కొల్లు రాంబాబు, కొల్లాటి వెంకట్రావు, ఆరదాని ఏడుకొండలు, లంకే చిరంజీవి, పొన్నమండ రాముడు, అంకాని సత్తిబాబు, శేరు సత్యనారాయణ, కామాడి రామకృష్ణ, మల్లాడి గోపి, ఓలేటి పుత్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ

మామిడికుదురు: పాశర్లపూడి ఉత్తరబాడవలో నూతనంగా నిర్మించిన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి నూతన ఆలయ, విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. మాఘ శుద్ధ దశమి ఉదయం 10.39 గంటలకు మృగశిర నక్షత్రయుక్త మేష లగ్నంలో భారం పురుషోత్తమనాయుడు, లక్ష్మీతులసి, చవటపల్లి వీరరాఘవులు, పార్వతిభవాని, చవటపల్లి బులిబాబులు, కమలానె్రహూ, అడబాల రమేష్, మోహినిరత్నశ్రీ దంపతులు ప్రధాన కర్తలుగా పాల్గొని పూజలు చేశారు. లూటుకుర్రు ధనమ్మపేటలో నూతన ఆలయ, విగ్రహ పునః ప్రతిష్ఠా మహోత్సవం కన్నుల పండువగా జరిపించారు. గాడి సత్తిబాబు, సరోజని దంపతులు కర్తలుగా పాల్గొని పూజలు చేశారు. పెదపట్నంలంక భద్రకాళీ సమేత బాల వీరభద్రేశ్వరస్వామి ఆలయం వద్ద శిరిగినీడి గోపీనాథ్, హేమజ్యోతి దంపతుల ఆధ్వర్యంలో వీరభద్రస్వామి సంబరం ఘనంగా జరిగింది.

వైభవంగా కొండాలమ్మ జాతర

మామిడికుదురు: పాశర్లపూడి గ్రామ దేవత కొండాలమ్మ జాతర సోమవారం వైభవంగా జరిగింది. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ జాతర మహోత్సవాలు 25వ తేదీ ఆదివారం వరకు ఏడు రోజుల పాటు జరుగుతాయని ఆలయ కమిటీ పేర్కొంది. ఆలయం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధనతో జాతర మహోత్సవాలు ముగుస్తాయన్నారు.

నేటి నుంచి ప్రతిష్ఠా మహోత్సవాలు

మామిడికుదురు: ఈదరాడ గ్రామదేవత పోశమ్మ అమ్మవారి ఆలయ పునః ప్రతిష్ఠా మహోత్సవాలు 20వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని ఆలయ పునర్నిర్మాణ సారథి యెరుబండి శ్రీరామమూర్తి సోమవారం తెలిపారు. శిథిలస్థితికి చేరిన ఆలయాన్ని సమూలంగా తొలగించి దాని స్థానే నూతనంగా ఆలయాన్ని నిర్మించారు. అమ్మవారి ప్రతిష్ఠా మహోత్సవం 22వ తేదీ గురువారం 11.53 గంటలకు నిర్వహించేందుకు భారీగా ఏర్పాట్లు చేశారు. పోశమ్మ అమ్మవారి ప్రతిష్ఠా మహోత్సవాలు ఈనెల 23వ తేదీ శుక్రవారం వరకు జరుగుతాయని శ్రీరామమూర్తి తెలిపారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



మొసలపల్లిలో పోలింగ్ కేంద్రం వద్ద వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దార్ విమలకుమారి

అంబాజీపేట: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ జె.విమలకుమారి సోమవారం పరిశీలించారు. వక్కలంక, మొసలపల్లి, ఇరుసుమండ గ్రామాల్లో ఉన్న పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. సమస్యాత్మక గ్రామాల్లో తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద దివ్యాంగుల సౌకర్యార్థం ర్యాంపులను నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలని సూచించారు. నిర్మాణ దశలో ఉన్న వాటిని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఆర్ఐ ఎండీ ఇబ్రహీం, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు, బీఎల్వోలు తహసీల్దార్ వెంట ఉన్నారు.

ఘనంగా వీరన్నబాబు సంబరం

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెంలో గ్రామస్తులు సోమవారం వీరన్నబాబు సంబరం జరిపారు. ఇలవేల్పుగా కొలిచే వీరన్నబాబుకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని జమ్మి వృక్షం వద్ద బోనాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు.

ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత సీట్లు కేటాయించాలి

కొత్తపేట: ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు అమలు చేయాలని ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు సూచించారు. సోమవారం స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఈఓ హరిప్రసాద్ మండలంలోని ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్స్, ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. 12 (1) సి ఆఫ్ ఆర్‌టీఈ యాక్ట్–2009 కి సంబంధించి 2024–25 విద్యా సంవత్సరానికి 25 శాతం ఫ్రీ సీట్స్ కేటాయించవలసి ఉందన్నారు. ఇందుకు అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో ముందుగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ నెల 20 లోపు పూర్తి చేయాలని తెలిపారు. అలాగే విద్యార్థులు అప్లికేషన్ ఆన్‌లైన్ చేసుకోవడానికి గడువు మార్చి 14వ తేదీ అని తెలిపారు. సమావేశంలో ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఆభరణాల తనిఖీ

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి బంగారం, వెండి ఆభరణాలను దేవదాయ శాఖ ఉప కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవానీ తనిఖీ నిర్వహించారు. ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ సమక్షంలో తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

షిర్డీ సాయి ఆలయ కార్యవర్గం ఎన్నిక

ఆలమూరు: గ్రామంలో వేంచేసిన షిర్డీ సాయి ఆలయ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా వంటిపల్లి పాపారావు, అధ్యక్షుడిగా చల్లా ప్రభాకరరావు, ఉపాధ్యక్షుడిగా కాలా అప్పారావు, కార్యదర్శిగా కొమ్మిశెట్టి లక్ష్మణరావు, సంయుక్త కార్యదర్శిగా చిలకమర్తి వాసుదేవరావు, కోశాధికారిగా నార్కెడిమిల్లి వెంకన్నబాబును సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే పది మంది సభ్యులకు కమిటీలో చోటు దక్కింది. నూతన కార్యవర్గాన్ని సహచర సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. షిర్డీ సాయినాథుడికి రూ.3.5 లక్షలతో సుమారు ఐదు కేజీల బరువైన మకరతోరణం తయారు చేయిస్తానని గౌరవ అధ్యక్షులు వంటిపల్లి పాపారావు హామీ ఇచ్చారు.